# తెలిసిందా నేనెవరో? (ఏక పాత్ర ఏకాంకిక)

తెర వేయగా–

రంగం – ఒక చెట్టు క్రింద–

దృశ్యము – భూమిపై వెల్లకిలా చైతన్యరహితుని వలె ఒక వ్యక్తి పడి వుంటాడు – మాసిన చింకి బట్టలతో, పెరిగిన గడ్డంతో బక్కచిక్కి.

అనుసర వాద్యం – విషాదజనకమైన రాగం.

(వాద్యం క్రమంగా క్షీణించి ఆగిపోతుంది. రూపు అగపడని గంభీరమైన గొంతు ప్రశ్నిస్తుంది)

ప్రశ్న: – ఒహో! ఎవరది!?

(జవాబు లేదు – నిశ్శబ్దం)

ప్రశ్న: పండడానికి ప్రక్కలేనట్టు – ఉండడానికి యిల్లయినా లేనట్టు – అలా చెట్టు క్రింద గడ్డిలో పడివున్న ఓ నిరాధార పక్షీ! యెవరు నువ్వు!?

(జవాబు లేదు – నిశ్శబ్దం)

ప్రశ్న: క్షీణించిన బడుగు శరీరం – జీర్ణించిన మలినపు వసనం – దారిద్ర్యపు మాసిన గడ్డం రూపొందిన దైన్యపిశాచం – ఎవరోయ్ నువ్వు? కటిక దరిద్రుడా!?

(జవాబు లేదు – నిశ్శబ్దం)

(తిరిగి నిశ్శబ్దం)

వ్యక్తి: (అలా నిశ్చలంగా పడుకొనే) ఊఁ. ఆగిపోయావేం? కానీ... అంతేనా చూశావ్ నువ్వు? అంధుడా – నీది బాహ్యదృష్టి మాత్రమేనా? జఠరాగ్నికి కాలికాలి కనలిపోయి పునర్నిర్మాణా శక్యమైన నా ప్రేగుల స్థితి? దారిద్ర్య వేదనా జంఝూమారుతానికి దారుణంగా విరిగిపోయిన నా శిధిలీకృత ఆశయాలూ ఆశలూ...?

(కొంచెంసేపాగి – చటన కూర్చుని – పిచ్చి చూపు చూసి)

నేనెవరో కావాలా...? విను!

(తల వంచి 10 అంకెలు లెక్కించు కాలం ఆగి తల యెత్తి.)

రాజ్యాంగసభా పీఠాలనెక్కి చట్టాలను నిర్మించి రాజ్యాలనేలే ధీవరులకు నేడు నాయందింకా శ్రద్ధ పూనని ప్రముఖ పాలకసభా సభ్యులకు రాజ్యం గురించీ, చట్టం గురించీ, పాలన గురించీ పాఠాలు చెప్పి పునాది వేసేవాడిని – నేను.

(తల వంచి 8 అంకెలు లెక్కించు కాలం ఆగి తల యెత్తి స్వరం కొంచెం హెచ్చించి)

ప్రళయ విధ్వంసకశక్తి – ఏటంబాంబు – నిర్మాతకు భౌతిక శాస్త్రం చెప్పి పునాది వేసేవాడిని – నేను.

(తల వంచి 6 అంకెలు... స్వరం యింకా హెచ్చించి) యావన్మానవ పూజితుడై మహాత్ముడైన అహింసావాదికి సత్య పరిశోధనకు కూడా 'జీవహింస చేయరాదు' 'సత్యమేవ జయము' అంటూ ప్రప్రథమ పాఠాలు చెప్పేది నేను.

(... 4 అంకెలు ....)

ఆకసమంటే సౌధం, సౌధాగ్రమందలి హంసతూలికా తల్పం, తల్పం ప్రక్కన యినుప బీర్వా, బీర్వాలో కోటి రూపాయలు ఆస్తి – సంపాదించిన వర్తక శిఖామణి 'ఒక వర్తకుడు' అంటూ చెప్పిన దానిని మననం చేసుకునేది నా వద్దనే.

(...2 అంకెలు.)

గుండుకు గుండెనిచ్చిన దేశభక్తుని రక్తానికి 'తొలికాక' నిచ్చేది నేను–

రచయితచేత ప్రప్రథమ వ్యాసాన్ని వ్రాయించేది నేను...

–కవికి గణ యతి ప్రాసలు చెప్పేది నేను –

–చిత్రకారునిచేత పెన్సిల్ పట్టించి సరళరేఖ గీయడం నేర్పేది నేను–

–వేదికనెక్కగల ప్రతి వక్తకూ వేదిక మీద మాట్లాడటం నేర్పేది నేను– (స్వృతి తగ్గించడం ఆరంభిస్తాడు)

నా శిష్యులు పాలక సభాసభ్యులు... మంత్రులు, ప్రధానులు, పాలకాధ్యక్షులు.

నా శిష్యులు అజేయులు, అద్వితీయులు, అవనత సర్వమానవ శిరస్కులు.

నా శిష్యులు లక్షాధికారులు, కోటీశ్వరులు, సర్వ సంపత్సమేతులు.

నా శిష్యులు సంఘంలో ఆదర్శప్రాయులు, ఉన్నతస్థానము నాక్రమించే అమరులు.

కాని నేనో?

నేను గులాంను – క్షుద్రుడును – భక్షుకుడను. జీవన్మృతుడను – సంఘంలో నా స్థానం నీచాతి నీచం.

(దీనంగా ఒరిగిపోతాడు.)

(కొంచెంసేపుండి – చపన కూర్చుని – ఉచ్చ స్వరంలో.)

పాలకాధ్యక్షుని మొదలు చప్రాసీ వరకు గల యావన్మంది కర్మచారులూ నా నిర్మాణం. మహాత్ములు, దేశభక్తులు, కవులు, చిత్రకారులు, గాయకులు, వక్తలు, వర్తకులు, ప్రతి నాగరికుడూ

నా నిర్మాణం. దేశమంతా నా నిర్మాణం–

కాని–

నాచే నిర్మింపబడిన యీ సంఘములో నా స్థితి అధమాతి అధమం! నీచాతి నీచం!!

(నీరసంగా ఒరిగిపోతూ మళ్లా కూర్చుని)

ప్రభుత్వం విధిస్తోంది – యేమనీ?

నేను కృతుల వరకూ సంగీతం నేర్చుకుని వుండాలి – లెక్కలెయ్యండి – ఏ చిత్రంనైనా గీయగలిగే చిత్రలేఖనం సాధన చేసి వుండాలి, ఏ వస్తువునైనా నిర్మింపగల శిల్పినై వుండాలి. నాటకం వ్రాయగలిగిన కవినై వుండాలి. కావ్యాలను అర్థం చేసుకోవడమేకాక అర్థం చేసుకోవడం నేర్పగల దర్శకుడనై వుండాలి. రెండు భాషలను క్షుణ్ణంగా తెలిసిన ఉభయభాషా ప్రవీణుడనై అనువాదకుడనై వుండాలి. గణితం, ఖగోళం, చరిత్ర, విజ్ఞానం ఆదిగా గల నాలుగు శాస్త్రాల్లో బాగా ప్రవేశముండాలి. సుమారు పదిహేను పద్ధతుల్లో బోధన సాగించగల వక్తనై వుండాలి. చిన్నపిల్లలను – లోని భావం మాటల్లో పెట్టటం చేతకాని, చెప్పిన మాట భావంలోకి మార్చడం చేతకాని చిన్నపిల్లలను పట్టుకుని గౌడిగేదె పెయ్యను మల్లే పోషించగలిగిన మనస్తత్వవేత్తనై వుండాలి, ముఖ్యంగా ఆదర్శప్రాయమైన శీలం, అలవాట్లు కలిగివుండాలి.

యిన్నిటిని విధించి–

వినండి! సోదరులారా! యావద్భారత సోదరులారా! వినండి–

–అద్వితీయములై పది కళలలో పరిశ్రమను విధించి, దేశ నిర్మాణ బాధ్యతనంతా నా నెత్తిపైనే పెట్టి, నా జీవితాన్నీ శీలాన్నీ అలవాట్లనూ శాసించి, దినమునకు అయిదు గంటలు బడిలోనూ అయిదు గంటలు యింటి వద్దనూ శ్రమ విధించి యిందుకు ప్రతిఫలంగా యిరవై రూపాయలు, కొందరికి పదహారు రూపాయలూ జీతం ఇస్తుందట విన్నారా! యింత – యింత – చవక బేరం యెక్కడైనా కన్నారా.

అసాధ్య సాధ్యమైన యింద్రియ నిగ్రహం సాధించి పది గొప్ప కళలలో ప్రవేశాన్ని సంపాదించి, దేశ నిర్మాణ బాధ్యతను భుజపీఠంపై భరించి పది గంటలసేపు పనిచేస్తే పదణాలు యిస్తారు. పదింటికీ పదణాలు. నేను – నేనెవరినో చెప్పాను కదూ! – ఆ నేను, నా కుటుంబం – పెద్ద కుటుంబం – రోజుకు పదణాలతో జీవిస్తుంది!

మానవావసరాలన్నీ సరిపుచ్చుకుంటూనేనా అనకు! అవసరాల ఒత్తిడి అధికమైతే పిశాచత్వం యిస్తాను నా కుటుంబానికి. పిశాచాలకు ఆహారం, గృహం మొదలైనవి అక్కరలేదు కదూ! నేను మాత్రం మెల్లిగా బ్రతికి సేవచేస్తాను దేశానికి.

(అలాగే ఆగి పిచ్చిచూపు చూస్తూ చప్న గట్టిగా) నేను బాండ్ వ్రాశానోయ్! అలా అని నేను – ప్రభుత్వం నాచేత – యీ న్యాయ సమ్మతమైన షరతులకు బాండ్ రాయించుకుందోయ్. అందుకోసరమే బ్రతికి వున్నాను. (కొంతసేపు వూరుకుని మెల్లిగా – వెనక్కు చేరబడి పడుకుంటాడు) తెలిసిందా! తెలిసిందా నేనెవరో! ★

*(ఆనందవాణి: మే, 1947)*